# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 81 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 19 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## జల్ సంచయ్ జన్ భాగీదారీ అవార్డులు

### అగ్రస్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం.. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 18 (నమస్తే ఉదయం) జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు- 2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం- 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేందప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది.

## ఆదివాసీ యువత ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని

# ఉన్నత శిఖరాలను చేరుకోవాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం) : ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను ఆదివాసీ యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. వారం రోజుల పాటు రాజేంద్రనగర్ లోని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ క్యాంపస్ లో యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో మై భారత్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 17వ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశంలో మంగళవారం రాజ్ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో ప్రభుత్వం ద్వారా ఎలాంటి అవకాశాలు,



బహుమతులు పొందిన ఆదివాసి యువత తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నృత్యం చేస్తున్న ఆదివాసి యువత

పథకాలు ఉంటాయో తెలుసుకున్న గిరిజన యువత వాటిని అందిపుచ్చుకోవడానికి కావాల్సిన అవకాశాలను సంబంధిత అధికారులను, కార్యాలయాలను సంప్రదించి పొందుకోవాలన్నారు. శిక్షణ ఇచ్చిన సంస్థలు కూడా గిరిజన య వత ఉపాధి అవకాశాలను పొందుకునే విదంగా సహకరించినప్పుడే సత్ఫలితాలు ఉం టాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, రైల్వే, సాంఘిక సంక్షేమశాఖ బోర్డు సభ్యురాలు, మాజీ యువజన సర్వీసుల జిల్లా కో ఆర్డినేటర్ నిర్మలదేవీ, హైదరాబాద్ జిల్లా యువజన అధికారి కుష్బుగుప్తా, జాతీయ యువజన సర్వీసుల శాఖ నుంచి అవార్డులు పొందిన భగవాన్ దాస్, పానుగంటి మహేశ్ లతో పాటు చత్తీస్ ఘడ్ , ఒడిసా, ఝార్కండ్, మహరాష్ట్ర, మద్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ యువత, వారిని తీసుకువచ్చిన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## డిసెంబర్ కన్నా ముందే చలి..

# జనజీవనం అస్తవ్యస్థం!

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలోని ఆదిలా బాద్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలపై చలి పంజా విసురుతోంది. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి, గ్రామీణ, గిరిజన వర్గాలను గజగజ వణికిస్తున్నాయి.

డిసెంబర్ ప్రవేశించక ముందే ఈ తీవ్రత ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి వీస్తున్న చల్లని గాలుల దాడికి ఈ ప్రాంతం అతలాకుతలమవుతోంది. వాతావరణంలో ఈ అసాధారణ మార్పు దీర్ఘకాలిక ప్రజారోగ్య, ఆర్థిక సమస్యలకు సంకేతంగా నిలుస్తోంది. ఆకస్మిక చలితీవ్రతకు సిద్ధంగా లేని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు, నిరాశ్రయుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ చలిగాలులు సాధారణ జీవితాన్ని ప్రభావితం చేయడమే కాకుండా, రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి.

**గుండెపోటు భయం..**

చలి తీవ్రత పెరుగుతున్న కొద్దీ, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులలో పాటు శ్వాసకోశ వ్యాధుల బాధితులు అధికంగా ప్రభావితమవుతున్నారు. జలుబు, దగ్గు, ఆయాసం, న్యుమోనియా వంటి శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసు పత్రులు కిటకిటలాడుతున్నాయి.



అధిక చలి కారణంగా రక్త నాళాలు సంకోచించి రక్తపోటు పెరిగి, గుండెపై భారం పడుతుంది. ఫలితంగా, ఇటీవల గుండెపోటు కేసులు పెరగడం, హృద్రోగులలో సమస్యలు తలెత్తడంతో ప్రజలలో మరింత ఆందోళన కలిగిస్తోంది.

**సంక్షేమ హాస్టళ్ల దుస్థితి..**

చలికాలంలో అత్యంత ఎక్కువ ఇబ్బందులు పడుతున్న వర్గం ప్రభుత్వ వసతి గృహాలు (హాస్టల్స్), గురుకులాల్లోని విద్యార్థులు.. సంగారెడ్డి, సూర్యాపేట వంటి జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లలో వేడినీటి యంత్రాలు పనిచేయకపోవడం, పూర్తి స్థాయిలో దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కోదాడ, సూర్యాపేటలోని ఎస్సీ బాలుర హాస్టల్స్‌లో కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చల్లని గాలులకు వణుకుతూ నేలపైనే నిద్రిస్తున్నారు. జహీరాబాద్ ఎస్సీ బాలికల వసతి గృహం వంటి శిథిలావస్థ భవనాల్లో సరిపడా మంచాలు లేకపోవడంతో నేలపై కునుకు తీయక తప్పడం లేదు. కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వ వ్యవస్థల విధి నిర్వహణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**రైతుకు చలి కోత..**

విపరీతమైన చలి వ్యవసాయ రంగంపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ప్రస్తుతం యాసంగి పంటకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల వరి నారు ఎదుగుదల మందగిస్తోంది. నారుమళ్లు ఆశించినంతగా పెరగకపోవడంతో నారు నాటు ఆలస్యం అవుతోంది. ఉదయం కురుస్తున్న మంచు, పత్తి వంటి పంటల నాణ్యతను దెబ్బతీసి, రైతుల దిగుబడిపై, ఆదాయంపై ప్రభావం చూపుతోంది. ఇక కూరగాయల పంటలకు సైతం కాత, పూత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంది.

**ప్రభుత్వం తక్షణమే స్పందించాలి!**

ఈ తీవ్రమైన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిద్ర వీడి వేగం పెంచాలి. ప్రభుత్వ హాస్టళ్లలో యుద్ధ ప్రాతిపదికన వేడి నీటి సదుపాయం, సరిపడా దుప్పట్లు, రగ్గులు, పరుపులు పంపిణీ చేయాలి. అలాగే పౌరులు కూడా వ్యక్తిగతంగా కొన్ని నివారణ చర్యలు తీసుకోవాలి. ఉన్ని వస్త్రాలు, ముఖ్యంగా తల, చెవులు, కాళ్లను కప్పి ఉంచాలి. ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ఇంటి లోపల ఉండాలి. వేడిగా ఉండే ఆహారం, పానీయాలు తీసుకోవాలి. ఈ విపరీత వాతావరణాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, ప్రభుత్వ యంత్రాంగం, పౌరులు సమన్వయంతో పని చేయడం అత్యవసరం.

# హిడ్మా ఎన్‌కౌంటర్

### ఏవోబీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత మృతి

### అమిత్ షా విధించిన గడువుకు 12 రోజుల ముందే ఆపరేషన్ సక్సెస్

### అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భీకర కాల్పులు

### నక్సలిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్

### హిడ్మా మృతిని ధృవీకరించిన ఏపీ డీజీపీ

మారేడుమిల్లి, నవంబర్ 18 (నమస్తే ఉదయం)

మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కమాండర్ మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉ దయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. విశేషమేమిటంటే, నవంబర్ 30లోపు హిడ్మాను పట్టుకోవా లని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన గడువుకు 12 రోజుల ముందే భద్రతా బలగాలు ఈ లక్ష్యాన్ని ఛేదించాయి. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో హిడ్మా తీవ్ర గాయాలతో మరణించాడు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కీలకమైన మావోయిస్టు డాక్యుమెంట్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ పరిణామంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పందించారు. “ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా



సమా చారంతోనే ఈ ఆపరేషన్ చేపట్టాం. నక్సలిజం నిర్మూలనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది” అని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రణాళికలో భాగంగానే హిడ్మా లాంటి అగ్రనేతలే లక్ష్యంగా బలగాలు ముందుకు సాగుతున్నాయి. హిడ్మా మృతితో మావోయిస్టు అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌కు కోలుకోలేని దెబ్బ తగిలినట్లయిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ విజయంతో బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్‌ను మరింత ముమ్మరం చేశాయి.




## ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు

### వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం

### పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే ఉదయం)

హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా

# జలమండలికి జల సంరక్షణ అవార్డు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

## జల సంరక్షణలో అవార్డు రావడం సంతోషంగా ఉంది

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి










హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే ఉదయం) నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా విశేష కృషిచేస్తున్న జలమండలికి మరో అవార్డు లభించింది. జల సంరక్షణలో జలమండలి చేపడుతున్న కృషికి గాను ప్రకటించిన అవార్డును జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు.కేంద్ర ప్రభుత్వం కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టాప్ మునిసిపల్ కార్పొరేషన్' కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచినందుకు ఈఅవార్డ్ అందించారు.కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన '10 టాప్ మున్సిపల్ కార్పొరేషన్' కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచినందుకు 'జల్ సంచయ్ జన భాగిదారి 1.0 అవార్డ్ అందించారు.జల మండలి నీటి భద్రతతో కూడిన భవిష్యత్తు కోసం నీటి సంరక్షణ మాత్రమే కాకుండా ప్రజల ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడంలో కూడా కీలక పాత్ర పోషించినందుకు, జేఎస్ జె బి పరిధిలో కమ్యూనిటీ ఆధారిత నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించడం ద్వారా “వాటర్ పాజిటివ్ యాక్షన్”ను ప్రేరేపించడమే కాకుండా, నీటి పట్ల కోల్పోయిన గౌరవాన్ని తిరిగి కలిగించిందని ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఈ అవార్డు భాగంగా నీటి సంరక్షణ కార్యక్రమాల కోసం రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహక బహుమతిని అందిస్తారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... జల సంరక్షణలో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. బోర్డు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లే ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి బోర్డు అధికారులపై నమ్మకం ఉంచి ప్రోత్సాహించడం.. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం అయినట్లు తెలిపారు.రోజురోజుకు హైదరాబాద్ మహానగరం అంతకంతకు అభివృద్ధి చెందు తోంది. దీంతో నగరంలో జీవిస్తున్న వారి సంఖ్య దాదాపు కోటిన్నర జనాభాను దాటింది. దీంతో ప్రజల అవసరాల కొరకు నీటివినియోగం మరింతగా పెరిగింది. జలమండలి వందల కిలో మీటర్ల నుంచి నీటిని తీసుకువచ్చి సరఫరా చేస్తుంది. అయినా భూగర్భ జలాన్ని ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. ఎంతగా అంటే భూమిలోకి ఇంకుతున్న నీటికన్నా నగరవాసులు బోర్ల ద్వారా వినియోగిస్తున్న నీరే అధికం. దీంతో భూగర్భ జలాలు ఆడుగంటి పోతున్నాయి. లాతూర్‌లో ఎదురైన నీటి కష్టాల అనుభవ దృష్ట్యా అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ఉండేందుకు సరిగ్గా ఏడాది క్రితం అక్టోబర్ 2న సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులు మీదుగా ' ప్రతి ఇంటా ఇంకుడు గుంత-90 డేస్ స్పెషల్ డ్రైవ్' పేరిట కార్యాక్రమానికి ప్రారంభింప జేసి నిరంతరం యజ్ఞంగా కొనసాగిస్తూ వస్తున్నారు.

## జాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరము పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందిస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ రిజిస్టర్ కోటేశ్వరరావు

శేరిలింగంపల్లి : నవంబర్ 18, (నమస్తే ఉదయం) మాదాపూర్ అరుణోదయ కాలనీలోని జాయ్ అనాధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరము తోపాటు పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణి చేయడం జరిగింది. బియ్యం, కిలో కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి తదితర వస్తువులను జాయ్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ పంపిణీ చేశారు. దానితో పాటు వైద్య శిబిరములో రోగులకు కావాల్సిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం జాయ్ ఫౌండేషన్ లో క్రియాశీలకంగా పని చేసిన నరేష్ అనే అనాధ ఏడాది క్రితం క్యాన్సర్ వ్యాధితో మృతి చేందడం జరిగింది. అతని ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ వైద్య శిబిరము నిత్యావసరాలను పంపిణీ చేయడం జరిగిందని నిర్వాహకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరుణోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ,బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ రిజిస్టర్ కొత్తపల్లి కోటేశ్వరరావు విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్ కుమార్ గత రెండు దశాబ్దాల నుండి వైద్య శిబిరాల ద్వారా హెచ్ ఐవీ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. 10 సంవత్సరా క్రితం జాయ్ ఫౌండేషన్ స్థాపించి అనాథలకు సేవ చేస్తున్నారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరుచుకోవాలన్నారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనడం నిర్వహించడం ప్రోత్సహించడం వలన ఆత్మ సంతృప్తి కలుగుతుందని అన్నారు. తాము సంపాదనలో కొంత ఈలాంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించినపుడే మన సంపాదనకు సార్ధకత ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు సృజనా రాజ్ కుమార్ ఆశ్రమ వాసులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వసంత్ కుమార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 200 మంది పేదలకు నిత్యావసర వస్తువు పంపిణి చేశారు.




మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ" చేస్తున్న విద్యార్థులు

## చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

### యువత బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు:జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (నమస్తే ఉదయం): దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని అందుకే యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మంగళవారం జనగామ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్థానిక ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల జనగామలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్ ( ఎన్ఎమ్బిఏ ) కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అన్నారు.కార్యక్రమంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ పోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవిప్రసాద్ విద్యార్థులచే "మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ"ను చేయించారు. దేశ భవిష్యత్తుతో పాటు తన భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత యువత చేతుల్లోనే ఉందన్నారు. మీ భవిష్యత్తుకు మీరే బాధ్యులని మీ భవిష్యత్తు ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకునే అవకాశం మీ చేతిలోనే ఉందన్నారు. విద్యతోనే విజ్ఞానం వస్తుందని చదువుకునే వయసులో భావితారాలకు ఆదర్శంగా నిలిచేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వరుధిని, తిరుమలేష్,గణేష్, రజిత, ప్రియదర్శిని, ముక్తాదిర్, రేఖ, కరుణాకర్, సేవా, నాగేందర్, నీతా, సబిహా బేగం, సమ్మయ్య, జ్యోతి, విద్యార్థులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## దిడిగం ఆంజనేయులుని పరామర్శించిన గుడి వంశీధర్ రెడ్డి



ఆర్థిక సహాయం అందజేస్తున్న గుడి వంశీధర్ రెడ్డి

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18(నమస్తే ఉదయం): జిల్లా లోని లింగాల ఘనపురం మండలం, మాణిక్యపురం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దిడిగం ఆంజనేయులు ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మండల మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్, గ్రామ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

### 1 కోటి 03 లక్షల రూపాయలు నిధులు మంజూరు

### నవాబ్ పేట్ రిజర్వాయర్లో 5 లక్షల 19 వేల చేప పిల్లలను విడుదల చేసిన ఎమ్మెల్యే కడియం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18(నమస్తే ఉదయం): జిల్లా లోని లింగాల గణపురం మండలం, నవాబుపేట గ్రామంలో మంగళవారం స్థానిక శాసనసభ్యులు కడియం శ్రీహరి, మాజీ జెడ్పిటిసి సభ్యులు గుడి వంశీధర్ రెడ్డి పర్యటించారు. ముందుగా శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై ఆలయ ఈవో శ్రీమతి లక్ష్మి ప్రసన్న తో చర్చించి సమీక్ష చేశారు. రానున్న మార్చి మాసంలో శ్రీ రామనవమి రోజు జరిగే శ్రీ రాములవారి కల్యాణ మహోత్సవ సందర్భంగా కళ్యాణ మండపం, ఆలయ వెలుపల గల మొత్తం ఫ్లోరింగ్ చేయించుట పూర్తి కావాలని అధికారులను కోరారు. ఆలయ అభివృద్ధి పనులకు గాను 1 కోటి 03 లక్షల రూపాయలు నిధులు మంజూరై పనుల అనుమతుల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. అనంతరం నవాబుపేట రిజర్వాయర్ లో చేప పిల్లల విడుదల కార్యక్రమంలో పాల్గొని 5 లక్షల 19 వేల చేప పిల్లలను విడుదల చేసారు. మత్స్యకారుల కోరిక మేరకు ఎమ్మెల్యే మెయిన్ రోడ్డు నుండి రిజర్వాయర్ కట్ట వరకు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, జీడికల్ దేవస్థాన చైర్మన్ ఏలే మూర్తి, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్ ను విడుదల చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు

## మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిగా ఉండాలి

### జిల్లా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్షలోమ్

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (నమస్తే ఉదయం): జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నశాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ ను అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) పింకేష్ కుమార్ , అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ ) బెన్షలోమ్ వారి అధ్యక్షతన కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నశాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని పోస్టర్ ఆవిష్కరణ చేసి, జిల్లా అధికారులతో, ఐడిఓసి, కలెక్టరేట్ కార్యాలయ అన్ని ఆఫీసుల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ ప్రతిజ్ఞ లో పాల్గొన్న వారి అందరితో మాదకద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామి అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలికి అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేపిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. కోదండరాములు, జిల్లా అధికారులు, ఐడిఓసి, కలెక్టరేట్ కార్యాలయ అన్ని ఆఫీసుల సిబ్బంది పాల్గొన్నరు.

## ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు

మొదటి పేజీ తరువాయి...

సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం డివిజన్ లో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా:

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) నవంబర్ 18 ( నమస్తే ఉదయం )మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సబిత అనిల్ కిషోర్ తో కలిసి మ వెంకటాపురం డివిజన్ లో పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటాపురం డివిజన్ లోని బురాన్ హౌసింగ్ సొసైటీ లో 25 లక్షలతో సిసి రోడ్ , జోషి నగర్ లో 25 లక్షల వ్యయంతో వేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. జోషి నగర్ లోని నాలకు పై కప్పు నిర్మాణాలు చేపట్టాలని కూడా ఇంజనీర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పెండింగ్ లో ఉన్న మౌలిక వసతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అమర్ షాకీర్, మునీర్ బాయ్, ముర్ధజ తంబు, వాలా జోషి నగర్ కాలనీవాసులు కుమారి రెడ్డి, శ్రీనివాస్, నాగేశ్వరరావు వినోద్, కృష్ణమూర్తి, నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, సయ్యద్ మోసిన్, జమేధర్, లోకేష్, వీణ ,శ్రీనివాస్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మచ్చ బొల్లారం డివిజన్ రాయల్ ఎంక్లేవే లో సీసీ రోడ్ పనులకు భూమి పూజ చేసిన రాజు జితేంద్రనాథ్.

## మచ్చ బొల్లారం డివిజన్‌ను సర్వం సుందరంగా తీర్చి దిద్దుతా

### కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) నవంబర్ 18 ( నమస్తే ఉదయం): మచ్చ బొల్లారం డివిజన్ సర్వాంగ సుందరం తీర్చి దిద్దుతానని స్థానిక కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ అన్నారు. మంగళవారం అల్వాల్ మచ్చ బొల్లారం డివిజన్ రాయల్ ఎంక్లేవ్ లో సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం 133 డివిజన్ రాయల్ ఎంక్లేవ్ రోడ్ నెంబర్ 7 లో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల్ ఎంక్లేవ్ లో 10 లక్షల వ్యయం తో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని చెప్పారు. మచ్చ బొల్లారం డివిజన్ మల్కాజిగిరి నియోజకవర్గంలో చాలా పెద్ద డివిజన్ అన్నారు. మైనంపల్లి హనుమంతరావు సహకారం తో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్, లడ్డు రెడ్డి, సంపత్ యాదవ్, కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, సుకూర్ , భాస్కర్ రెడ్డి, అనిల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విజయ్ రెడ్డి, శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




పిస్తా హౌజ్ యజమాని మజీద్ కు చెందిన వసీం విల్లా..



గోల్డెన్ హైట్స్ లోని మజీద్ నివాసం

## గోల్డెన్ హైట్స్ కాలనీలోని పిస్తా హౌజ్ యజమాని మజీద్ నివాసంలో ఐటీ, జీఎస్టీ అధికరుల సోదాలు

బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం) : పిస్తా హౌజ్ యజమాని మజీద్ నివాసం ఉండే రాజేంద్రనగర్ సర్కిల్ గోల్డెన్ హైట్స్ కాలనీలోని వాసీమ్ విల్లా 2-6-7/జీ/104 లో మం గళవారం ఉదయం ఇన్ కంటాక్స్, జీ ఎస్ టి అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం 6:30 గంటలకు మజీద్ నివాసం చేరుకున్న ఐటీ, జీఎస్టి అధికారులు సాయంత్రం వరకు సోదాలు నిర్వహిస్తునే ఉన్నారు. మజీద్ ఇంటికి చేరుకున్న ఐటీ, జీఎస్టీ అధికారులు మజీద్ తో పాటు ఆయన ఇద్దరు కుమారులు సెల్ఫోన్ లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇంటి గేటు వద్ద ఐటీ కి చెందిన విజిలెన్స్ అధికారులతో బందోబస్తు ను ఏర్పాటు చేసి ఎవరిని ఆటు వైపు రాకుం డ చూశారు. సాయంత్రం వరకు ఐటీ సోదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై రాజేం ద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ ను వివరణ కోరగా ఐటీ సోదాలతో తమకెలాంటి సంబందం లేదన్నారు.

## పార్కు నిర్మాణ పనులను ఆకస్మిక తనిఖీ చేసిన కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



పటాన్ చెరు, నవంబర్ 18(నమస్తే ఉదయం): ప్రజా ప్రయోజనార్థం నిర్మిస్తున్న పార్కు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం, ఇల్లు కూల్చిన వ్యర్థాలను పార్కులో లెవెలింగ్ వాడుతున్నందుకు కాంట్రాక్టర్ ను కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ హెచ్చరించారు. పటాన్ చెరు జిహెచ్ఎంసి అధికారుల ద్వారా నోటీసులు అందజేసారు.డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధిలో భాగంగా పటాన్చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో మంజీర స్కూల్ పక్కన 45 లక్షల జిహెచ్ఎంసి నిధుల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న పార్కు నిర్మాణ పనులను పటాన్ చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కార్పొరేటర్ గారు కాంట్రాక్టర్ అవలంబిస్తున్న పలు నాణ్యత లోపాలను గుర్తించారు. పార్కులో ఇళ్లు కూల్చిన వ్యర్థాలు వేస్తున్నారని ఈ విషయమై కాంట్రాక్టర్ను పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితం లేదని, అలాగే స్థానిక జిహెచ్ఎంసి అధికారులు కూడా ఈ విషయంలో ఎటువంటి జోక్యం చేసుకోవడం లేదని కార్పొరేటర్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడేకి అలాగే ఎస్ ఇ శంకర్ నాయక్ కు ఫిర్యాదు చేశారు. నిర్మాణ విషయంలో పలుమార్లు హెచ్చరించినప్పటికీ కాంట్రాక్టర్ పెడచెవిన పెడుతున్నాడని అలాగే స్థానిక జిహెచ్ఎంసి అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. అంతే కాకుండా పార్కు నిర్మాణం గ్రౌండ్ లెవెల్ నుండి నిర్మించడం లేదని అన్నారు కాబట్టి తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గారు జోనల్ కమిషనర్ ను ఎస్ ఇ ని కోరారు.ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ జిహెచ్ఎంసి అధికారుల ద్వారా పార్కులోని నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని, నిర్మాణంలో ఎటువంటి నాణ్యత లోపాలు ఉండకూడదని లేనియెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తుది హెచ్చరిక నోటీసులు కాంట్రాక్టర్ కు జారీ చేయించారు.¶ా

## నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ భూములు

### అసైన్మెంట్ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హెచ్చరిక.

### భవిష్యత్తు అవసరాల కోసమే ప్రభుత్వ భూములపరిరక్షణ.

### భూముల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



పటాన్ చెరు నవంబర్ 18(నమస్తే ఉదయం): నియోజకవర్గ పరిధిలోని ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు, అమీన్ పూర్ మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఇటీవల అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో ప్రభుత్వ భూమి వివాదంపై ఎమ్మార్వో వెంకటేశం, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కృష్ణ లతో కలిసి ఆయన మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, రెవెన్యూ అధికారులు, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, డెవలపర్స్ తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్న లక్ష్యంతో ఇళ్లను కొనుగోలు చేసిన కాలనీ వాసులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. అందరి సమక్షంలో మరోమారు జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూముల వివరాలను సేకరించి.. కబ్జాలకు గురికాకుండా పూర్తిస్థాయి రక్షణ ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ పార్కులు, రహదారులను కబ్జా చేసి.. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు. గజం ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా కబ్జాదారులు జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. కొన్ని మండలాల పరిధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడానికి ప్రభుత్వ భూములు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ఫంక్షన్ హాళ్ళు, విద్యాసంస్థలు, సబ్ స్టేషన్లు, గోదాములు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను వినియోగించబోతున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు.

# ఐక్యత స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి చేయాలి

## అదనపు కలెక్టర్ నర్సింగరావు






గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్18(నమస్తే ఉదయం) దేశ సమగ్రతను కాపాడేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ధైర్య సాహసాలు మనందరిలో ప్రతినిత్యం ఐక్యత స్ఫూర్తిని కలిగిస్తాయని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. దేశ తొలి ఉప ప్రధాని, కేంద్ర హెూం శాఖ మంత్రిగా పనిచేసిన భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏక్ భారత్, ఆత్మ నిర్భర భారత్ నినాదంతో, నెహ్రూ యువ కేంద్రం మహబూబ్ నగర్ వారి సహకారంతో మంగళవారం గద్వాల తేరు మైదానం నుంచి పట్టణ పురవీధుల మీదుగా యూనిటీ మార్చ్ (జిల్లాస్థాయి ఐక్యత పాదయాత్ర) నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు పాల్గొని నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, భారతమాత, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్మరించుకుంటూ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ జీవిత చరిత్ర పుస్తకాలు చదివితే ఆయన గురించి మరిన్ని విషయాలు తెలుస్తాయన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన సమయంలో బ్రిటిష్ వాళ్లు దేశ విభజన చేయడంతో గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 565 సంస్థానాలలో హైదరాబాద్, జునాగడ్, కాశ్మీర్ రాజులు భారత యూనియన్ లో తమ సంస్థానాలను కలిపేందుకు నిరాకరించడంతో సర్దార్ చాకచక్యంగా వ్యవహరించారన్నారు. ఆయన కృషి ఫలితంగానే నేడు మన దేశం ఐక్యతతో విరాజిల్లుతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా పలు కులాలు, మతాలు, జాతుల ప్రజలు నివసిస్తున్నప్పటికీ, వివిధ సంస్కృతి సంప్రదాయాలు కలిగిన, అనేక భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నప్పటికీ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తూ కలిసికట్టుగా జీవిస్తున్నామన్నారు. ఏక్ భారత్, ఆత్మ నిర్భర భారత్ నినాదంతో 2047 సంవత్సరం నాటికి మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఇప్పుడు విద్యార్థులుగా ఉన్న పిల్లలే అప్పటివరకు యువతగా మారి దేశాభివృద్ధిలో తన వంతు కీలకపాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమంలో ఎన్నో త్యాగాలు చేసిన నాయకులను స్మరించుకుంటూ, దేశ సమైక్యతకు బాటలు పరిచిన గొప్ప వాళ్లను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ నిర్వాహకులతో కలిసి జెండా ఊపి ఐక్యత పాదయాత్ర ను ప్రారంభించారు. పలు పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ మార్చ్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథీ, ఇతర కళాకారులు దేశభక్తి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. డ్రగ్స్, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాష్ట్రీయ ఏకత దివస్ పై విద్యార్థులు, యువత తో వేరువేరుగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా అధికారి కోటా నాయక్, గద్వాల మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, పాదయాత్ర కమిటీ కన్వీనర్ బండల వెంకట్ రాములు, కో కన్వీనర్ అనిల్ కుమార్, ఇతర అధికారులు, యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# "జల్ సంచాయ్ - జన్ భాగీధారీ"లో సౌత్ జోన్‌లో జనగామ జిల్లాకి ద్వితీయ స్థానం

## ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు రూ.కోటి నగదు అందుకున్న జిల్లా కలెక్టర్


న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న జిల్లా కలెక్టర్, డిఆర్డిఓ

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18(నమస్తే ఉదయం): జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "జల్ సంచాయ్ - జన్ భాగీధారీ" కార్యక్రమంలో సౌత్ జోన్‌లో జనగామ జిల్లా కి ద్వితీయ స్థానం సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు రూ. కోటి నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జల్ శక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. మంగళవారం న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ డిఆర్డిఓ పీడీ వసంత పురస్కారం అందుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం లో జల్ సంచాయి జన్ భాగీ దారి (1.0) లో భాగంగా జిల్లా లోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయలలో (1)వర్షపు నీటి ఇంకుడు గుంతలు(2)రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ (3) బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ (4) పాం పాండ్స్ (5) చిన్న నీటి ఊట కుంటలు (6)కాంటూరు కందకాలు (7) మ్యాజిక్ సోక్ పిట్స్ (8) చెక్ డ్యామ్స్ ఇట్టి పనులు జాతీయ ఉపాధి హామీ పతకం నిధుల తో జిల్లా లోని 281 గ్రామ పంచాయతీ లలో అవసాలలో 30569 పనులను చేపట్టగా భూగర్భ జల నీటి మట్టం పెరిగింది. తద్వారా త్రాగు,సాగు నీటి ఏద్దది లేకుండా పోయింది, ఇట్టి పనులను కేంద్ర జల్ శక్తి శాఖ గుర్తించి జిల్లా కు జల పురస్కారం క్రింద ఒక్క కోటి నగదు రూపాయలు ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరం లో జల్ సంచాయి జన భాగీ దారి 2.0 క్రింద జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ 24 జూన్ 2025 రోజన మన జిల్లా మన నీరు అనే నినాదం తో కలెక్టర్ కార్యాలయం ప్రాంగణం లో తక్కువ ఖర్చు తో వర్షపు నీటి ఇంకుడు గుంత నిర్మణన్ని ప్రారంభించి. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు తగు సూచనలు చేస్తూ జిల్లా లోని ప్రతి గ్రామ మండల, జిల్లా, స్థాయి అధికారులకు టార్గెట్ ఇవ్వడం జరిగింది. తక్కువ ఖర్చు తో వర్షపు నీటి సంరక్షణ గుంతలు ఇప్పటి వరకు 7350 నిర్మాణం పూర్తి కాగా,వచ్చే సంవత్సరం మార్చ్ 31 వరకు సుమారు 50000 వర్షపు నీటి సంరక్షణ గుంతలు నిర్మిచాలని కలెక్టర్ జిల్లా లోని అధికారులకు, సామాజిక సంస్థ లకు, ప్రజలకు తెలిపారు. తద్వారా మన జిల్లా లో త్రాగు, సాగు నీటి ఏద్దది రాకుండా చూడాలిసి బాధ్యత జిల్లా లోని అందరి మీద ఉందన్నారు. జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వరి ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన బస్తాల ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్
కొనుగోలు రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 18(నమస్తే ఉదయం)వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల పురపాలిక పరిధిలోని జమ్మిచేడు గ్రామం వద్ద మెప్మా ఆధ్వర్యంలో, ఎర్రవల్లి మండలం తిమ్మాపూర్ గ్రామం వద్ద ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటిదాకా రైతుల నుంచి ఎంత ధాన్యం కొనుగోలు చేశారో నిర్వాహకులను అడిగారు. తేమ శాతం, గింజల పరిమాణాన్ని కొలిచే విధానాన్ని పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద ఆరపెట్టిన ధాన్యాన్ని చూశారు. కేంద్రానికి కేటాయించిన టార్పాలిన్లు, గన్ని సంచుల వివరాలను అడిగారు. రైతుల సాగు ధ్రువీకరణకు సంబంధించి ఆయా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు ఇచ్చే టోకెన్స్ పరిశీలించారు. పొలం యజమానుల చేనుల్లో పంటలు సాగుచేసిన కౌలు రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేశాక వివరాలను యాప్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలను ట్యాబ్ లో ఓపిఎంఎస్ (ఆన్లైన్ ప్రొక్యూర్ మెంట్ మేనేజ్మెంట్ సిస్టం) ఎప్పటికప్పుడు నమోదు చేయకపోవడం సరికాదని, ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత మిల్లులకు ధాన్యం రవాణా ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఐకెపి డిపిఎం అరుణ, ఏపీఎం సలోమి, గద్వాల మండల వ్యవసాయ శాఖాధికారి ప్రతాప్ కుమార్, ఏఈఓలు ప్రవళిక, నరేష్, మెప్మా అధికారులు శ్రీకర్, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




కాటేదాన్ లో నిరసన తెలుపుతున్న సీ పి ఎం నాయకులు

# ఎల్లంపల్లిలో హత్యకు గురైన రాజశేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలి: సీపీఎం నాయకులు

బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం) : షాద్ నగర్ నియోజకవర్గం ఫరూకనగర్ మం డలం ఎల్లంపల్లి కి చెందిన ఎర్ర రాజశేఖర్ ను కిడ్నాప్ చేసి హత్య చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, హత్యకు గురైన రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాజేంద్రనగర్ సర్కిల్ కమిటీ సభ్యులు కాలె యాదయ్య డిమాండ్ చేశారు. కాటేదాన్ చౌరస్తాలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిం చారు. ఎల్లంపల్లి కి చెందిన దళిత యువకుడు ఎర్ర చంద్రశేఖర్ ఇతర కులానికి చెందిన య వతిని కులాంతర వివాహం చేసుకున్నాడని, అతని అన్న ఎర్ర రాజశేఖర్ ను కిడ్నాప్ చేసిన య వతి కుటుంబ సభ్యులు రాజశేఖర్ ను అతి దారుణంగా పెట్రోల్ పోసి తగులబెట్టారని వా పోయారు. ఈ సంఘటన కు కారకులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాదిత కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ తగిన చర్యలు తీసుకోవాల న్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు బచ్చలకూర స్వామి, చుక్క మోహన్, బానోత్ శంకర్, శ్రీనుకుమార్, మహేందర్‌లు పాల్గొన్నారు.

# ఉమ్రా బస్సు యాత్రలో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి, నవంబర్ 18 (నమస్తే ఉదయం) మక్కాలో జరిగిన ప్రమాదంలో ఉమ్రా యాత్రకు వెళ్లిన హైదరాబాదీలు చనిపోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మక్కా ప్రమాదంలో మరణించిన అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్‌కు చెందిన రహీమున్నీసా కుటుంబ సభ్యులను కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్ తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో లింగాల ఐలయ్య, జావీదుద్దీన్, మొయిన్, మహమ్మద్ నూర్ ఖాన్, షైక్ ఇస్మాయిల్, చాంద్ సాబ్, నిజాం, కమల్, అబ్దుల్ హమీద్, సలీం, మల్లికార్జున్, జుబేర్, యోగి రాజు, పర్వీన్ సుల్తానా, నజ్మా తదితరులు పాల్గొన్నారు.




# లైంగిక దోపిడీ, దుర్వినియోగం, హింస నివారణపై అవగాహన

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 18(నమస్తే ఉదయం) జిల్లా కేంద్రంలో గల భరోసా కేంద్రంలో ఎస్.ఆర్.విద్యానికేతన్ లో భరోసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జిల్లా ఎస్ పి టి. శ్రీనివాసరావు ఆదేశానుసారం లైంగిక దోపిడీ, దుర్వినియోగం, హింస నివారణ, అలాగే బాధితుల పునరావాసం, స్వస్థత కోసం ఎస్.ఆర్. విద్యా నికేతన్ లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టం, అందులోని శిక్షలు, భరోసా కేంద్రం అందించే సేవలు, మొబైల్ ఫోన్ దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, అలాగే యుక్తవయసులో వచ్చే ఆకర్షణలపై జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సురక్షిత వాతావరణం, తమనుతాము రక్షించుకోవడం, హింసను వెంటనే తెలియజేయాలనే చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్, భరోసా సెంటర్ ఎస్సై తారక, కోఆర్డినేటర్ శివాని, సపోర్ట్ పర్సన్ స్రవంతి, స్కూల్ డైరెక్టర్ రాముడు, వైస్ ప్రిన్సిపాల్ సుచరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య



బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం):ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి సోమవారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మైలార్దేవుపల్లి డీఐ మక్సూద్ అలీ వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన మహ్మద్ నౌషద్ కుటుంబం లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్పలో నివాసం ఉంటుంది. నౌషద్ కు 8 మంది సంతానం. వారిలో ఐదుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. నౌషద్ ఫ్లవర్ డెకరేషన చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ మద్య తరచు మద్యం సేవిస్తు భార్యతో గొడవ పడుతున్నాడు. కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు ఎక్కువైనాయి. తాగడం మానేయమని భార్య చెప్పడంతో మనస్తాపానికి గురైన నౌషద్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పని నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లోని ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. మైలారేవుపల్లి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమారం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జోరుగా ఫిల్టర్ ఇసుక రవాణా..అడ్డూ...అదుపేది..?



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్18(నమస్తే ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మట్టి త్రవ్వకాలు జరిపి ఫిల్టర్ ఇసుక తయారీ చేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పెడుతున్నారు. బహిరంగానే ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా ఇసుక ఫిల్టర్ లకు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న విద్యుత్ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### జనం నోట్లో మట్టి

అక్రమార్కులు మట్టితో ఫిల్టర్ చేసిన ఇసుకను గద్వాల పట్టణంతో పాటు గద్వాల, ధరూర్ మండలాలోని పలు ప్రాంతాలల్లో గృహ నిర్మాణాలకు అక్రమార్కులు సామాన్య ప్రజలకు నాణ్యమైన ఇసుక అని చెప్పి ఒక్క ట్రాక్టర్ ఇసుకకు 5-6 వేల రూపాయలకు అమ్ముతున్నారు .అక్రమార్కులు అమాయక ప్రజల నోట్లో మట్టి పోస్తున్నారు. జనాలను మోసం చేస్తున్న ఫిల్టర్ ఇసుక తయారీదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### కీలక నేతల కనుసనల్లోనే ఫిల్టర్ దందా..

గద్వాల మండలానికి చెందిన ముఖ్య నాయకుల కనుసన్నలోనే ఈ ఇసుక మాఫీయా కొనసాగుతుంది. అవసరమైనప్పుడు ఫిల్టర్ ఇసుక కేంద్రాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు చేసి ఫిల్టర్ ఇసుక కేంద్రాలను సీజ్ చేస్తున్నారు. కాని ఓ గ్రామంలో నాలుగైదు ఫిల్టర్ ఇసుక కేంద్రాలున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అటు వైపు కన్నెత్తి చూడటం లేదంటే మండల నాయకులు పలుకుబడి ఏమేర ఉందో ఇట్టే తెలుస్తోంది. వ్యవసాయ పొలాల వద్ద ఫిల్టర్లు ఏర్పాటు చేస్తూ ఇసుకను తయారుచేసి ట్రాక్టర్ల ద్వారా పలు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా రెవెన్యూ పోలీస్ యంత్రాంగం కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టాలన్నిటిని ఇసుక అక్రమార్కులు తమ చుట్టాలుగా మార్చుకొని దర్జాగా తమ దందాను సాగిస్తున్నారు.

### అబాసు పాలవుతున్న ఉచిత విద్యుత్..

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుంటే దానిని ఇసుక వ్యాపారులు అడ్డదారుల్లో మట్టిని ఫిల్టర్ చేయడానికి వాడుతున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తీసుకువచ్చి తమ వ్యవసాయ బోరు బావుల వద్ద నీటితో మట్టిని ఫిల్టర్ చేస్తూ ఇసుకను తయారు చేస్తున్నారు. అయినా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఈ వ్యవహారం కనిపించకపోవడం శోచనీయం. గద్వాల మండలం గోనుపాడు,సంగాల, ధరూర్ మండలంలో ఫిల్టర్ ఇసుక కోసం అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని ఆయా గ్రామాల విద్యుత్ లైన్మెన్ లకు, మండల విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే గ్రామాల లైన్మెన్ లకు ఇసుక వ్యాపారులు ముడుపులు అందించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇసుక వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబర్ 18(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 2025 జూలై 15న అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న ప్రోటోకాల్ ఉల్లంఘన వివాదం,కౌకూర్ ఫార్చ్యూన్ ఎంక్లేవ్ కాలనీ వాసులపై నమోదైన కేసు పునఃపరిశీలన శాంతి భద్రతా చర్యల పురోగతి,అంశాలను డిజిపి తో వివరంగా చర్చించారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ప్రజలపై అనవసరమైన కేసులు నమోదు చేయకుండా, న్యాయబద్ధంగా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పోలీసు డిజిపి బి. శివధర్ రెడ్డి సానుకూలం గా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్,మేకల రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# వీసా గడువు ముగిసినా విదేశీయులు.. గుర్తించిన పోలీసులు

బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం) : సౌబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో 250 మంది పోలీసులు మంగళవారం ఉదయం 4 గంటల నుంచి బండ్లగూడ సన్ సిటీ తో పాటు హైదర్ గూడ ఎర్రబోడ ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ, ఒక అదనపు డీసీపీ, ముగ్గురు ఏసీపీ ల తో కలసి 250 మంది వివిధ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారన్నారు. పీ అండ్ టీ కాలనీలో ఎక్కువగా ఆఫ్రికా దేశాలకు చెందిన వారు నివాసం ఉంటుండంతో ఆ ప్రాంతంలో పోలీసులతో పాటు బ్యూరో ఇఫ్ ఇమిగ్రేషన్, ఫారినర్స్ రిజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు చెందిన అధికారులు ఈ తనిఖీలలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉగండ కు చెందిన ముగ్గురు విదేశీయులు, సుడాన్‌కు చెందిన ఒక విదేశీయుడు వీసా గడువు ముగిసాక కూడా నగరంలోనే ఉంటున్నట్లు గుర్తించామన్నారు. వారిని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్


వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్


ఎర్ర బోడ లో కార్డెన్ సెర్చ్ ద్వారా తనిఖీ లు చేస్తున్న పోలీసులు


తనిఖీలను పర్యవేక్షిస్తున్న రాజేంద్రనగర్ ఏ సీ పి తుల శ్రీనివాస్

ఆఫీసు ద్వారా వారి వారి దేశాలకు పంపించే ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

**ఎర్రబోడ లో కార్డెన్ సెర్చ్ లో 38 ద్విచక్రవాహనాలు, 14 లీటర్ల మద్యం స్వాధీనం :**

రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ ఎర్రబోడ లో నిర్వహించిన కార్డెన్ సెర్చ్ సందర్భంగా సరైన పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ దగ్గరుండి తనిఖీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటికి పత్రాలు ఉంటే వదిలిపెడతామని తెలిపారు. రెండు లిక్కర్ కేసులను నమోదు చేసి వారి నుంచి 14 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

**ప్రజల కు నమ్మకాన్ని, భద్రత ను కల్పించడానికే కార్డెన్ సెర్చ్ లు : డీసీపీ యోగేశ్ గౌతమ్**

ప్రజలలో నమ్మకాన్ని, శాంతిభద్రతలను కాపాడటానికి తీసుకుంటున్న చర్యలలో భాగమే కార్డెన్ సెర్చ్ అని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. ఆసాంఘిక శక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.


ఫెన్సింగ్ వేస్తున్న హైడ్రా సిబ్బంది

## బంరుకున్ దౌల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని స్థలాలకు ఫెన్సింగ్ వేసిన హైడ్రా అధికారులు

బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి లోని జాతీయ పోలీస్ అకాడమీ సమీపంలో గల బంరుకున్దా దౌల చెరువు ఎఫ్ టీ ఎల్ పరిధిలో గతంలో కూల్చివేసిన అక్రమ కట్టడాల స్థలంలో హైడ్రా అధికారులు మంగళవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆ పనులను చేస్తున్న హైడ్రా అధికారులను కొందరు ఆ స్థలాలు మావి అని ఫెన్సింగ్ వేయడాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కోర్టులో విచారణ లో ఉన్న సమయంలో తమ స్థలాల చుట్టు ఫెన్సింగ్ వేయడం బాధాకరమని వాపోయారు. బంరుకున్నీల చెరువు సమీపంలో తమ ప్లాట్లు ఉన్నాయని జైనబ్ ఫాతిమ, అనీస్ ఫాతిమ, మహ్మద్ ఇబ్రహీం లు అంటున్నారు. చెరువు పక్కన ఎఫ్ టీ ఎల్ పరిధిలోకి వచ్చే స్థలాలకు ఫెన్సింగ్ వేస్తున్నామని హైడ్రా అధికారులు తెలిపారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన ఎస్ఐ



మెదక్, నవంబర్ 18(నమస్తే ఉదయం) మెదక్ జిల్లా టేక్మల్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికాడు. మెదక్ జిల్లా టేక్మల్ పోలీస్ స్టేషన్ లో సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజేష్ పనిచేస్తున్నాడు, బి ఎన్ ఎస్ ఎస్ చట్టం, 2023లోని సెక్షన్ 35(3) కింద జారీ చేయబడిన నోటీసులకు సంబంధించి టేక్మల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన దొంగతనం కేసులో నిందితులుగా ఉన్న ఫిర్యాదుదారు , అతని సహచరుడిపై లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్నారు. ఈ కేసుకు సంబంధించి", పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారు నుండి 30 వేలు లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. ఏసీబీ అధికారులను చూడగానే ఏవో లంచం మొత్తంతో పారిపోయాడు. అధికారులు అతన్ని వెంబడించి జై దుర్గాభవాని వైన్స్ ఎదురుగా ఉన్న వ్యవసాయ పొలాలలో పట్టుకున్నారు. ఏవో నుండి 30 వేలు లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏవో తన ప్రజా విధిని అనుచితంగా , నిజాయితీ లేకుండా నిర్వర్తించి, అనవసరమైన ప్రయోజనాన్ని పొందాడు.అందువల్ల, ఏవో ని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని అదనపు ప్రత్యేక న్యాయమూర్తి, ఎస్ పి ఈ, ఏసీబీ కేసుల విచారణ కోర్టు ముందు హాజరుపరుస్తున్నాము. కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచాము.ఫోన్ నంబర్ 1064 కు కాల్ చేయండి (టోల్ ఫ్రీ నంబర్)ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌ను అంటే 1064ను సంప్రదించాలని అభ్యర్థించారు.




## ఐసియులో చికిత్స పొందుతున్న మనిషాని పరామర్శించిన ఎర్రబెల్లి సతీష్ రావు

కూకట్ పల్లి, నవంబర్ 18(నమస్తే ఉదయం) భూదేవి హిల్స్ లో గత కొన్ని సంవత్సరాలుగా నివసిస్తున్న మనిషా అనే మహిళని అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు మీ ఇళ్ళు రోడ్డు మీదకి కట్టారు కావున మీరు ఇల్లు కట్టుకున్న ప్రదేశంలో నుంచి కొంత జరగాల్సి ఉంటుంది లేదంటే మేమే కూల్చేస్తాము అంటూ గత కొన్ని రోజులుగా రకరకాలుగా వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అయితే నిన్న అతనికి ఉన్న మంది మార్బలంతో వెళ్లి మనిషా అనే మహిళ వారి ఇంటికి వెళ్లి మీ ఇంటికి కొంత భాగం వరకు కూలగొట్టడం జరుగుతుంది అని చెప్పి వాళ్ళ ఇంటికి హద్దులు అని మార్కింగ్ ఇవ్వడంతో ఆ సమయంలో భయాందోళనకు గురైన ఆ మహిళ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆల్ అవుట్ లిక్విడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే విషయం తెలుసుకున్న ఆమె భర్త హుటాహుటిన జగద్గిరిగుట్ట లోని పద్మజ హాస్పిటల్ కి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు మంగళవారం హాస్పిటల్ కి వెళ్లి మనీషాని, వారి కుటుంబ సభ్యులని పరామర్శించి ఎటువంటి భయాందోళనలకు గురి కావద్దు అంటూ ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు, చట్టం తనపనీ తను చేసుకుంటూ వెళుతుంది మీ ఇల్లు కూలగొట్టాల్సిన అవసరం ఎవరికీ లేదు మీకు తప్పకుండా మేము మా బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటాము అని హామీ ఇచ్చి ఆమె చికిత్స కొరకు ఖర్చుల కొరకు ఎర్రబెల్లి సతీష్ రావు ఆర్థిక సహాయం చేశారు.

## ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఏఈ



గోపాల్ పేట :నవంబర్ 18(నమస్తే ఉదయం) ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో లంచాలు తీసుకుంటూ అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుపడుతున్న సంఘటనల పరంపర కొనసాగుతోంది. మంగళవారం వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం విద్యుత్ శాఖ ఏఈ హర్షవర్ధన్ రెడ్డి ట్రాన్స్ ఫార్మర్ మంజూరి కోసం రూ.20వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే.. రెండు సంవత్సరాల క్రితం విద్యుత్ శాఖ ఏఈ గా విధుల్లో చేరిన హర్షవర్ధన్ రెడ్డి ఓ రైతుకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేసేందుకు రూ.50వేలు లంచం డిమాండ్ చేశాడు. ఆ రైతు అంత ఇచ్చుకోలేను అని కోరగా.. చివరకు. 40 వేలకు తగ్గేది లేదు అని తేల్చి చెప్పడంతో.. ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం రైతు కు మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ సారథ్యంలో అధికారులు డబ్బులు ఇచ్చి పంపారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈకి రైతు 20వేల రూపాయలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. ఏఈ నుంచి రూ.20వేలు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేశారు. ఇటీవలే విద్యుత్ శాఖలోనే పనిచేస్తున్న మరో అధికారి సోదరీమణితో కోటి రూపాయల కట్నంతో ఎంగేజ్మెంట్ జరిగినట్లు సమాచారం. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఈ ని బుధవారం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్ లింగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. వనపర్తి డీఈ, ఏడీ గోపాల్ పేట విద్యుత్ కార్యాలయానికి వచ్చారు. వారి ద్వారా డీఎస్పీ బాలకృష్ణ వాంగ్మూలం తీసుకున్నారు.


గోదావరి అంజిరెడ్డికి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

## ఘనంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి జన్మదిన వేడుకలు

పటాన్ చెరు నవంబర్ 18(నమస్తే ఉదయం): సంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం బొల్లారంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బొల్లారం మున్సిపల్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బొల్లారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా, అందరూ ఆమెను దీవించాలని కోరారు.

## తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర త్రోబాల్ సంబంధించిన కమిటీలు రద్దు

### టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ అధ్యక్షులు సత్యం శ్రీరంగం




కూకట్ పల్లి, నవంబర్ 18 (నమస్తే ఉదయం) త్రోబాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్రంలో త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ భవిష్యత్తు, పటిష్టత కొరకు త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తాము అని తెలియజేస్తూ గతంలో ఉన్న త్రోబాల్ సంబంధించిన అన్ని కమిటీలను తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గా రద్దు చేయడం జరిగిందని తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ అధ్యక్షులు సత్యం శ్రీరంగం అన్నారు. త్రోబాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా అధ్యక్షులు రామన్ కుమార్ సాహ్నీ, జనరల్ సెక్రటరీ గౌతమ్ కుమార్ సింగ్ సూచనలు, సహాయ సహకారాలతో తెలంగాణ క్రీడాకారుల పటిష్టత, భవిష్యత్తు కోసం రాష్ట్ర వ్యాప్తంగా త్రోబాల్ క్రీడాభివృద్ధికి తోడ్పడుతామన్నారు. ఏళ్ల తరబడి జనరల్ బాడీ మీటింగ్‌లు జరగకపోవడం, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించకపోవడం, కార్యదర్శి ఏకపక్షంగా సభ్యులను తొలగించడం, అంకితభావంతో పనిచేసే సభ్యులను పక్కన పెట్టే ప్రయత్నాలు, క్రీడాకారుల సంక్షేమంపై దృష్టి పెట్టకపోవడం, క్రీడపై సాంకేతిక అవగాహన లేకపోవడం, అలాగే త్రోబాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా (టి ఎస్ ఐ) నిబంధనలు పాటించకుండా అనుబంధ రుసుములు కూడా చెల్లించకపోవడం వంటి తీవ్రమైన అవకతవకలు జరుగుతున్నాయి అనే కారణాలతో కేంద్ర కమిటీ సూచనల మేరకు అన్ని కమిటీలను రద్దు చేయడం జరిగింది అని అన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్ లో త్రోబాల్ క్రీడాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ సహకారతో ముందుకు తీసుకుపోతామని టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం తెలిపారు.



మున్సిపల్ కార్యాలయం ముందు తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరసనకు సంఘీభావం ప్రకటించిన బిఆర్ఎస్ పార్టీ

పటాన్ చెరు,నవంబర్ 18(నమస్తే ఉదయం): తమకు గత ఆరు నెలలుగా జీతభత్యాలు అందకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు నిరసనకు దిగారు.జిన్నారం పురపాలక సంఘం కార్యాలయం ముందు నిరసనకు దిగిన పారిశుద్ధ్య కార్మికులు గత ఆరు నెలల నుంచి జీతభత్యాలు లేక వారు పడుతున్న అవస్థలను తట్టుకోలేక మంగళవారం నిరసన చేపట్టారు. బిఆర్ ఎస్ పార్టీ నాయకులు వారి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ పారిశుద్ధ్య కార్మికులు ఆరు నెలలుగా జీతాలు లేక రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని ,అధికార యంత్రాంగం,కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పరిస్థితి చూసి ఇప్పటికైనా వారి జీతాలు సకాలంలో అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు పారిశుధ్య కార్మికులు ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, జిన్నారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ గౌడ్, బ్రహ్మేందర్ గౌడ్, అంజిరెడ్డి, నిఖిల్ గౌడ్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు


పూజలో పాల్గొన్న కాటా సుధా శ్రీనివాస్ గౌడ్

## రాజశ్యామల యాగంలో ప్రత్యేక పూజలు చేసిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు, నవంబర్ 18(నమస్తే ఉదయం): శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన రాజశ్యామల యాగంలో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కాటు సుధా రాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో 13 మంది వేదపండితుల సమక్షంలో నిర్వహించిన రాజశ్యామల యాగం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ పవిత్ర యాగ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలందరికీ ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్లు చెప్పారు.


విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య

## మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

### మున్సిపల్ కమిషనర్ వెంకట రామయ్య

పటాన్ చెరు ,నవంబర్ 18(నమస్తే ఉదయం): మాదకద్రవ్యాలకు యువత బానిసలు కాకూడదని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గడ్డపోతారం మున్సిపల్ కమీషనర్ వెంకట రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను చేయించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాకీర్ హుస్సేన్, అధ్యాపకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్న ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులచే మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తామని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తానని డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యుక్త వయసులో పిల్లలు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా చదువు పట్ల శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య సూచించినారు.ఈ కార్యక్రమంలో పి ఈ టి సత్యనారాయణ,పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, రామకృష్ణ,శ్రీనివాస్,వినోద్,వరప్రసాద్ మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## నేడు వ్యవసాయ పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు కౌన్సిలింగ్

బుద్వేల్, నవంబరు 18 (నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను పీజీ, పీహెచ్ డీ కోర్సులలో ప్రవేశానికి రెండవ విడత కౌన్సిలింగ్ ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు వర్శిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు వర్శిటీ అధికారులు తెలిపారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు కౌన్సిలింగ్ కు హాజరు కావాలని కోరారు. ఇందుకు సంబందించిన సమాచారాన్ని విశ్వవిద్యాలయ వెబ్ సైట్ %ఃఃః.జూయ్ఞుబ.వసబ.అఅ% లో పొందవచ్చన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733